సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

రిటైర్డ్ హెచ్‌ఎంకు సన్మానం



సన్యాసిరావు దంపతులను సన్మానిస్తున్న సీతారత్నం

పద్మనాభం: రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసి ఇటీవల పదవీ విరమణ పొందిన ముద్రగడ సన్యాసి రావు దంపతులను రిటైర్డు ఉపాధ్యాయిని డి.సీతారత్నం పాఠశాలలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. దుశ్శాలువాతో సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యం అందక ఆవు గర్భంలో దూడ మృతి

కొమ్మాది: మూగజీవి ఆవు ప్రసవ వేదనతో ఒక అపార్ట్‌మెంటు వాసులను తల్లడిల్లిపోయేలా చేసిన సంఘటన బీచ్ రోడ్డులో చోటు చేసుకుంది. తిమ్మాపురం రామానాయుడు ఫిల్మ్ స్టూడియో దరి జ్యూవెల్ అపార్టుమెంటు సమీపంలో గురువారం అర్ధరాత్రి నుంచి ఓ ఆవు ప్రసవ వేదన పడుతూ గట్టిగా అరుస్తూ ఉంది. ఆవు వేదన చూడలేక అపార్ట్‌మెంట్‌వాసులు శుక్రవారం ఉదయం భీమిలి పశువైద్యశాల వైద్యురాలు అనూషకు సమాచారం అందించారు. అయితే ఆమె రాకపోవడంతో ఆ ఆవు గర్భంలోనే దూడ మృతి చెందింది. సరైన సమయానికి వైద్యం అంది ఉంటే ఆవుదూడ బతికి ఉండేదని అపార్ట్‌మెంట్‌వాసులు ఆరోపిస్తున్నారు. 1962 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసినా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని అపార్ట్‌మెంట్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. అత్యవసర పశు వైద్య సంచార వాహనం వచ్చినా, ఆ ఆవును తరలించేందుకు సరైన పరికరాలు లేక అక్కడే వదిలేశారు. ఆవు పరిస్థితి కూడా విషమంగానే ఉంది.

'ఆపస్' కార్యవర్గం ఎన్నిక



ఆపస్ కార్యవర్గం

పద్మనాభం: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) పద్మనాభం మండల కార్యవర్గ ఎన్నికలు అనంత పద్మనాభ స్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం జరిగాయి. మండల శాఖ అధ్యక్షునిగా లగుడు అప్పారావు, గౌరవ అధ్యక్షుడిగా పి.చంద్రునాయుడు, ప్రధాన కార్యదర్శిగా మైపూడి శంకర నారాయణ, కోశాధికారిగా ఆల్తి శ్రీనివాసరావు, మీడియా కన్వీనర్‌గా బి.తమ్మినాయుడు, మహిళా కన్వీనర్‌గా ఎ.,చంద్రకళ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా టి.కుమారి, బి.సురేష్, సంధ్యాదేవి, డి.చిన్నారి, సి.హెచ్.అప్పలరాజు, కళావతి, ఫాతిమా బేగం, బి.మమతను, కార్యదర్శులుగా ఎస్.అప్పన్న, వి.శంకరరావు, పి.రమణమ్మ, జి.శంకరరావు, బి.రాజ్యలక్ష్మి, టి.బాబూరావు, ఎ.ఈశ్వరరావు, వి.సత్యవతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జిల్లా కార్యవర్గంలో ముగ్గురికి స్థానం

జిల్లా కార్యవర్గంలో ఉపాధ్యక్షులుగా కంటుభుక్త మురళి, కళిగ శివ, కార్యదర్శిగా తాలాడ అప్పలనాయుడుకు స్థానం కల్పించారు. రాష్ట్ర పరిశీలకుడు ఎం.పి.శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు అవనాపు అరుణ్ కుమార్, జిల్లా గౌరవ అధ్యక్షుడు కాళ్ల గోపీనాథ్ సమక్షంలో ఈ ఎన్నికలు జరిగాయి.


ప్రమాదకరంగా బావి



పాండ్రంగిలో రోడ్డును ఆనుకుని ఉన్న బావి

పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో రోడ్డును ఆనుకుని ఉన్న బావి ప్రమాదకరంగా మారింది. పాండ్రంగి–సామయ్యవలస రోడ్డును ఆనుకుని పాండ్రంగిలో అల్లూరి సీతారామరాజు జనన గృహం వద్ద ఈ బావి ఉంది. ఆనందపురం మండలం బోని పద్మనాభం మండలం మద్ది, అనంతవరం, పెంట, కొవ్వాడ గ్రామాలకు చెందిన వారు ద్విచక్ర వాహనాలపై ఈ రోడ్డు మీదుగా తగరపువలసకు రాకపోకలు సాగిస్తారు. ఎదురుగా లారీలు వంటి భారీ వాహనాలు వచ్చేటప్పుడు రోడ్డు పక్కకు వెళ్లే ప్రయత్నంలో అదుపు తప్పి ఈ బావిలో పడిపోయే అవకాశముంది. పరిసర ప్రాంతాల్లో ఆడుకునే చిన్న పిల్లలకు కూడా ప్రమాదం పొంచి ఉంది. పాలకులు, అధికారులు స్పందించి ఈ బావిని పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పడకేసిన పారిశుధ్యం



ఎండాడలో మురుగుతో నిండిన డ్రైనేజీ



పార్కులో కుప్పలుగా వ్యర్థాలు

పారిశుధ్య లోపంతో వ్యాధులు విజృంభిస్తున్నా యి. 8వ వార్డు పరిధి రుషికొండలో ఏడుగురికి డెంగ్యూ జ్వరాలు నిర్ధారణ అయ్యాయి. వీరిలో నలుగురు కేజీహెచ్‌లో, ముగ్గురు గీతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి ఇంత తీవ్రంగా ఉన్నా పారిశుధ్య నిర్వహణపై అధికారులు శ్రద్ధ చూపడం లేదనడానికి వార్డులో పరిస్థితే నిదర్శనం.

- ప్రతీ ప్రాంతంలో మురుగుతో నిండిన డ్రైనేజీలు
- రోడ్లపై కుప్పలుగా వ్యర్థాలు
- దోమలతో ప్రజల అవస్థలు
- విజృంభిస్తున్న విషజ్వరాలు
- 8వ వార్డులో ఏడుగురికి డెంగ్యూ

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో పారిశుధ్యం పడకేసింది. ఆడపాదడపా కురుస్తున్న వర్షాలతో కాల్వల్లో చెత్త పేరుకుపోయి భరించలేని దుర్గంధం వెదజల్లుతోంది. మరోవైపు విపరీతంగా పెరిగిపోయిన దోమలతో ప్రజలు తరచూ వ్యాధులబారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో వార్డు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

పూర్వ కమిషనర్, ఎమ్మెల్యే హెచ్చరించినా..

ఎండాడ వరాహగిరినగర్, సాగర్‌నగర్, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, దుర్గానగర్, రాజీవ్‌నగర్, మునలయ్యపాలెం, చిన్న రుషికొండ, పెద్ద రుషికొండ, గుడ్లవానిపాలెం ప్రాంతాల్లో ఎక్కడ చూసినా వ్యర్థాలు రోడ్డుమీదే దర్శనమిస్తున్నాయి. నెలల తరబడి ఇదే పరిస్థితి నెలకొంది. వార్డులో పారిశుధ్య నిర్వహణపై గతంలో పూర్వ జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, ఇటీవల ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పలుమార్లు అసహనం వ్యక్తం చేసినా, సంబంధిత అధికారుల్లో మాత్రం మార్పు రావడం లేదు.

ప్రచార ఆర్భాటమే..

స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛ విశాఖ అంటూ ఉన్నతాధికారుల ప్రచారాలే తప్ప, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నంగా ఉంటోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రచారంపై ఉన్న శ్రద్ధ పారిశుధ్య నిర్వహణపై లేదని మండిపడుతున్నారు.

వ్యాధుల బారిన ప్రజలు

పారిశుధ్య నిర్వహణ లోపంతో ఇక్కడి ప్రజలు వ్యాధులతో సతమతమవుతున్నారు. ఇప్పటికే రుషికొండ, ఒమ్మివానిపాలెం, ఎండాడ ప్రాంతాల్లో పదుల సంఖ్యలో ప్రజలు విషజ్వరాలతో బాధపడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే విషజ్వరాలు మరింత విజృంభించే ప్రమాదం ఉంది. శానిటరీ సిబ్బంది గానీ, ప్రజారోగ్య సిబ్బంది గానీ, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



వరాహగిరినగర్‌లో నివాసాల మధ్య నిల్వ ఉన్న మురుగునీరు

అధికారులు వచ్చినప్పుడే శుభ్రత



రోడ్డుపై పేరుకుపోయిన చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించాలి. కాల్వల్లో మురుగు రోజుల తరబడి నిల్వ ఉండిపోవడంతో దుర్గంధం భరించలేకపోతున్నాం. దోమల కారణంగా కంటిపై కునుకు ఉండట్లేదు. అధికారులు పారిశుధ్య నిర్వహణను పట్టించుకోవడం లేదు. కలెక్టర్, కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులు వచ్చినప్పుడు మాత్రమే పూర్తిస్థాయిలో శుభ్రం చేస్తున్నారు. మిగిలిన రోజుల్లో ఎక్కడి చెత్త అక్కడే.

– చెన్నా ఎల్లయ్య, రుషికొండ

దుర్గంధం, దోమలు



మా ప్రాంతంలో డ్రైనేజీలు ఘోరంగా ఉన్నాయి. ఓ వైపు కంపు మరోవైపు దోమలతో జీవనం సాగించాల్సిన పరిస్థితి. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. అసలే వానాకాలం వచ్చేసింది. ఇప్పటికైనా అధికారులు మా ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలి.

– దువ్వి వాసు, ఎండాడ

ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు



పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేక మా ప్రాంతంలో జ్వరాలు పెరిగిపోతున్నాయి. వైరల్ జ్వరాలతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు మా సమస్య అర్థం చేసుకోవాలి. ఎప్పటికప్పుడు చెత్త తొలగించేలా, డ్రైనేజీలు శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలి.

– లొడగల రాము, ఎండాడ

తక్షణ చర్యలు తీసుకుంటాం

8వ వార్డులో పారిశుధ్య పరిస్థితులు మెరుగు పరిచేందుకు తక్షణ చర్యలు తీసుకుంటాం. జ్వరాలు ప్రబలుతున్న ప్రాంతాలను గుర్తించి ప్రభుత్వ వైద్యులను, శానిటరీ సిబ్బందిని అప్రమత్తం చేస్తాం. వార్డుప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూస్తాం.

– కె.కనకమహాలక్ష్మి, జోన్ 2 జోనల్ కమిషనర్

గాయత్రీనగర్‌లో 8 మందికి డయేరియా

- జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో వైద్యశిబిరం



వైద్యశిబిరం వద్ద యూపీహెచ్‌సీ సిబ్బంది

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరోవార్డులోని గాయత్రీనగర్ జేఎన్‌యూఆర్‌ఎం కాలనీలో 8మందికి డయేరియా సోకడంతో కాలనీలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 21 మందికి పరీక్షలు చేయగా వారిలో 8 మంది వ్యాధికి గురైనట్లు గుర్తించి, వైద్యసేవలు అందించామని, వారిలో ఆరుగురు కోలుకున్నారని పీఎం పాలెం యూపీహెచ్‌సీ వైద్యాధికారి పల్లా సుజాన్ తెలిపారు. ఒకరు కేజీహెచ్‌లో చికిత్స పొందుతుండగా, మరొకరు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. కాలనీలో 24/7 ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి, అనుమానితులకు పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. సకాలంలో వైద్యసేవలు అందించి చర్యలు తీసుకోవడంతో వ్యాధి అదుపులోకి వచ్చిందని తెలిపారు. కాలనీవాసులు పరిశుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని ఆమె సూచించారు. జోన్–2 జెడ్సీ కనకమహాలక్ష్మి ఆదేశాలతో కాలనీలో అన్ని బ్లాకుల వద్ద సిబ్బంది బ్లీచింగ్ పౌడర్ చల్లారు. కాలనీలోని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు జామి శివ కుమార్ సేవలు అందించారు.

అపారిశుధ్యంపై డీపీవో ఆగ్రహం?

తగరపువలస: ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీలో అపారిశుధ్యంపై డీపీవో శ్రీనివాసరావు శుక్రవారం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆకస్మికంగా పర్యటించిన ఆయనకు శానిటేషన్‌పై స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. దీనిపై అధికారులు నోరు మెదపడం లేదు. డీపీవో పర్యటన వివరాలు వెల్లడించడానికి ఇష్టపడటం లేదు.

రూ.25 కోట్ల ప్రభుత్వ భూమి స్వాధీనానికి విశ్వయత్నం

- మంత్రి రామానాయుడుతో మొక్కలు నాటించిన వైనం
- క్రీడామైదానానికి భూమి పూజ పేరుతో ప్రచారం



మంత్రి రామానాయుడుతో టీడీపీ నాయకులు మొక్కలు నాటించిన స్థలం

తగరపువలస: ఆనందపురం మండలం గిడిజాల పంచాయతీ దిబ్బడిపాలెం సర్వే నంబర్ 258లో సుమారు రూ.25 కోట్ల విలువైన రెండెకరాల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు కూటమి ప్రభుత్వానికి చెందిన కబ్జాలలో ఘనుడైన ఒక వ్యక్తి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే పంచాయతీలో రూ.40 కోట్ల విలువైన నాలుగు ఎకరాలను కబ్జా చేసి రిసార్ట్, స్విమ్మింగ్‌పూల్ నిర్మించిన ఆ వ్యక్తి మండలంలోని పలువురు టీడీపీ నాయకుల నుంచి గట్టిగా విమర్శలను ఎదుర్కొంటున్నాడు. ఇటీవల ఆ కబ్జాదారునిపై టీడీపీకే చెందిన నాయకులు కలెక్టరుకు ఫిర్యాదుపై ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో వణుకు పుట్టిన ఆ నాయకుడు ప్రత్యామ్నాయంగా క్రీడాస్థలం పేరుతో ఎదురుగా ఉన్న ఈ స్థలాన్ని కాజేయడానికి అవసరమైన దారులన్నీ వెదుకుతున్నాడు. ఇప్పటికే పంచాయతీలో రెండు చోట్ల విశాలమైన ఆటస్థలాలు ఉండగా ఈ మూడోది ఎందుకని గిడిజాల పంచాయతీ వాసులే అంటున్నారు. ఈ 258 సర్వే నంబర్‌లో స్థలం క్రీడా మైదానానికి అవసరం లేదని సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు కూడా చేయనున్నారు. స్థానిక యువకులను మభ్యపెట్టడానికే శుక్రవారం మంత్రి రామానాయుడుతో ఈ స్థలంలో మొక్కలు నాటించారని.. బయటకు ప్రచారం మాత్రం క్రీడా మైదానానికి భూమిపూజ చేయించినట్టు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. కబ్జాదారుడు కొందరికి చిల్లర ఎరవేసి క్రీడా మైదానం ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నట్లు బిల్డప్ ఇస్తున్నాడని, కానీ అది జరగదని పంచాయతీలో మరో వర్గం వ్యతిరేకిస్తోంది.

పీఏసీఎస్ త్రీమెన్ కమిటీ చైర్మన్‌గా ప్రసాద్

మధురవాడ: మధురవాడ ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం త్రీమెన్ కమిటీని ప్రభుత్వం నియమించింది. కమిటీ చైర్మన్‌గా మధురవాడ పిలకవానిపాలేనికి చెందిన పోతిన ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు మంత్రి నిమ్మల రామానాయుడు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి పిల్లా వెంకటరావు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమించాలి



శారదానగర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

మధురవాడ: స్మార్ట్ మీటర్లతో కరెంటు బిల్లులు విపరీతంగా పెరిగిపోతాయని, ప్రజలు వీటిని వ్యతిరేకించాలని సీపీఎం నాయకులు కోరారు. స్మార్ట్‌మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 5వ వార్డు శారదానగర్, మారికవలస పరిసర ప్రాంతాల్లో శుక్రవారం విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఇబ్బందులు, అదనపు చార్జీల భారాలు లేకుండా చూస్తామని ఓట్లు వేయించుకుని గద్దెనెక్కిన జనసేన, టీడీపీ నాయకులు ఇప్పుడు స్మార్ట్ మీటర్లు బిగించడానికి సిద్ధం అవుతున్నారన్నారు. విద్యుత్ ప్రైవేటీకరణ, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా అంతా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు బి.భారతి, డి.కొండమ్మ, కె.సుజాత, ఆర్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలాజీనగర్‌లో సీపీఎం ర్యాలీ

తగరపువలస: అదానీ విద్యుత్ ప్రీ పెయిడ్‌స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని కోరుతూ భీమిలి డివిజన్ సీపీఎం నాయకులు ఒకటోవార్డు బాలాజీనగర్‌లో ఇంటింటా ప్రచారం చేస్తూ, ర్యాలీ నిర్వహించారు. స్టిక్కర్లు, కరపత్రాలు పంపిణీ చేస్తూ.. స్మార్ట్ మీటర్ల వలన పొంచి ఉన్న అనర్థాల గురించి తెలియజేశారు. పార్టీ జోన్ సహాయ కార్యదర్శి ఎస్.అప్పలనాయుడు మాట్లాడుతూ ఎవరైనా స్మార్ట్ మీటర్లు పేరుతో ఇంటికి వస్తే తిప్పి పంపించాలన్నారు. సిటు మండల అధ్యక్షుడు నీలాతి రాము, నాయకులు పాల్గొన్నారు.

'తొలిఅడుగు'కు ఉపాధి కూలీల తరలింపు



కుసులవాడ నుంచి తీసుకువచ్చిన ఉపాధి కూలీలకు ఫొటోలు తీస్తున్న వీఆర్పీ అప్పల సూర్యనారాయణ



వివిధ పంచాయతీల నుంచి ఆటోల్లో తీసుకువచ్చిన ఉపాధి కూలీలు

తగరపువలస: ఆనందపురం మండలం గిడిజాలలో శుక్రవారం జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో నిర్వహించిన సభకు మంత్రి నిమ్మల రామానాయుడు హాజరవడంతో, ఆ సభను విజయవంతం చేసేందుకు అధికారులు, కూటమి నాయకులు నానా తంటాలు పడ్డారు. మండలంలోని ప్రతి పంచాయతీ నుంచి ఆటోల ద్వారా 200 మంది ఉపాధి హామీ కూలీలను తరలించే బాధ్యతను వీఆర్పీలు, మేట్‌లకు అప్పగించారు. దీంతో పనులను మధ్యలో వదిలేసి ఉదయం 9 గంటలకే ఆటోల ద్వారా కూలీలను తరలించారు. గిడిజాల చేరుకున్న తరువాత కూలీలు పక్కకు వెళ్లకుండా వీఆర్పీలు ఫొటోలు తీసుకుని, సభా ప్రాంగణంలోకి తరలించారు. భరించలేని ఉక్కపోత, అంతలోనే భారీ వర్షంతో ఉపాధి కూలీలు ఇబ్బంది పడ్డారు. ప్రతి గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం జరపవలసి ఉండగా మండలంలోని ప్రతి పంచాయతీ నుంచి ఉపాధి కూలీలను గిడిజాల తరలించి విమర్శలపాలయ్యారు. ఉదయం 10 గంటలకు రావలసిన మంత్రి మధ్యాహ్నం ఒంటి గంటకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో కలిసి చేరుకున్నారు. సభ జరుగుతున్న సమయంలో కూడా వర్షం కురుస్తుండటంతో టెంట్లు కారిపోయి, నిలబడ్డారు.

ఆగస్ట్ 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా, చిత్రంలో మంత్రి రామానాయుడు

తగరపువలస: కేంద్ర ప్రభుత్వ సహకారంతో రైతులకు ఈ నెలలో అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20వేలు అందించనున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆగస్ట్ 15 నుంచి రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తామన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆనందపురం మండలం గిడిజాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. 2027 చివరి నాటికి పోలవరం పూర్తి చేస్తామని చెప్పారు. నియోజకవర్గంలో చెరువుల అభివృద్ధితో పాటు జగ్గమ్మగెడ్డ రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం మహిళలకు ఏడాదికి మూడు ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు ఇస్తుందని మంత్రి అనగా మహిళలు దానిని ఖండించారు. తమకు గ్యాస్ సిలిండర్ల డబ్బులు పడలేదన్నారు. కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడారు.

శాకంబరిగా భూలోకమ్మ





శాకంబరి అలంకరణలో రేవళ్లపాలెం భూలోకమ్మ, దుర్గాలమ్మ ఆలయంలో అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

మధురవాడ: ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని ఆరో వార్డు పరిధి రేవళ్లపాలెం గ్రామదేవత భూ లోక అమ్మవారిని శాకంబరిగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. పరిసర గ్రామాల ప్రజలు సమర్పించిన ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు, పూలతో అర్చకులు రామ్మూర్తి శర్మ అమ్మవారిని విశేషంగా అలంకరించి, పూజలు చేశారు.

దుర్గాలమ్మకు ప్రత్యేక పూజలు

చంద్రంపాలెం జాతరగట్టు దుర్గాలమ్మ వారికి శుక్రవారం విశేష పూజలు చేశారు. భాస్కర్‌నగర్‌కు చెందిన బండి కిషోర్‌కుమార్, కృష్ణకుమారి దంపతుల సహకారంతో 300మందికి అన్న ప్రసాదం అందజేశారు. పిలకవానిపాలెం వాస్తవ్యులు బోగవిల్లి అప్పలరాజు, రమాదేవి దంపతులు ఉదయం, సాయంత్రం పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు.

డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: పద్మనాభంలో రూ.6లక్షలతో చేపట్టనున్న సిమెంటు సైడు కాలువల నిర్మాణానికి ఎంపీపీ కంటుబోతు రాంబాబు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ నిధులు రూ.3 లక్షలు, జిల్లా పరిషత్ నిధులు రూ.3 లక్షలతో పద్మనాభం జంక్షన్ నుంచి సచివాలయం వరకు ఈ సిమెంటు సైడు కాలువ నిర్మించనున్నట్టు తెలిపారు. ఈ డ్రైనేజీ నిర్మాణం వల్ల విజయనగరం–శొంఠ్యాం ఆర్అండ్‌బీ రోడ్డు మీదకు మురుగు నీరు రాకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కృష్ణాపురం ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మి పాల్గొన్నారు.

పాత వంతెన రోడ్డు శిథిలం



బంగ్లామెట్ట శివాలయం నుంచి పాత వంతెన రోడ్డు శిథిలమై ఇలా..

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు బంగ్లామెట్ట శివాలయం నుంచి గోస్తనీ నదిపై పాత వంతెన రోడ్డు శిథిలమై, ప్రమాదకరంగా ఉంది. 35 ఏళ్ల క్రితమే నదిపై వంతెన శిథిలమై కూలిపోయినా, ఈ రహదారిని పలువురు ఇప్పటికీ వినియోగిస్తున్నారు. ఇక్కడి బస్టాప్ నుంచి చాలావరకు నగరంలోకి సిటీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. అంతేకాకుండా ఈ మార్గంలో తగరపువలస శ్మశానవాటిక ఉంది. నదీతీరంలో మేతకు పశువులు, మేకలను తోలుకు వెళ్తుంటారు. కానీ చాలాసార్లు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ ప్రాంతానికి డెబ్రిస్ తరలిస్తూ తరచూ జుగుప్సాకరంగా తయారు చేస్తుంటారు. పలువురికి ఉపయోగకరమైన ఈ ప్రాంతాన్ని శుభ్రం చేసి, శిథిలమైన మార్గాన్ని పునరుద్ధరించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

అందరి సహకారంతో బాల్య వివాహాల కట్టడి



బాల్య వివాహాల వల్ల అనర్థాలపై వివరిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తగరపువలస: బాల్య వివాహాలను కట్టడి చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని బొగ్గు రోడ్డు సచివాలయ పరిధి సంతపేట అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నపూర్ణ, ఏఊవీ లక్ష్మి కోరారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించేందుకు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులతో శుక్రవారం సమావేశమయ్యారు. మహిళా పోలీస్ శశికళ మాట్లాడుతూ నిర్ణీత వయసు వచ్చేవరకు అమ్మాయికి వివాహం చేయకూడదన్నారు. సంతపేట అంబేడ్కర్ జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. మధ్యలో చదువు మానేసిన వారు తిరిగి పాఠశాలలో చేరే విధంగా అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

భీమునిపట్నం: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) భీమిలి పట్టణశాఖ నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం జరిగింది. విశాఖ జిల్లా ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి టి.రామకృష్ణ ఎన్నికల నిర్వహణ అధికారిగా వ్యవహరించారు. గౌరవ అధ్యక్షుడిగా డి. ఈశ్వరరావు,అధ్యక్షుడిగా సీహెచ్.మోహనకృష్ణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా టి.వి.సతీష్‌కుమార్, ఎన్.జయసుధ, ప్రధాన కార్యదర్శిగా ఆర్.కోటేశ్వరరావు, కార్యదర్శులుగా కె.వెంకటరమణ, ఎస్.వరహాలబాబు, బి.సూర్యప్రభాకరరావు, జిల్లా కౌన్సిలర్‌లుగా కె.ఎస్.ఎస్.ఎన్.శ్రీనివాసరావు, సీహెచ్.చిన్నంనాయుడు, బి.సత్యరాజును, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.